


హైదరాబాద్ వార్త

# హెచ్ఎంపివి వైరస్ కలకలం..!



**-మళ్లీ కరోనా తరహా నిబంధనలు**
**-ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సూచన**
**-కరోనా పట్ల తీసుకున్న జాగ్రత్తలే పాటించాలి**
**-రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించాలంటున్న వైద్యులు**

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** చైనాలో మరో వైరస్ వ్యాప్తి చెందుతోందని, ప్రజలు పెద్దఎత్తున ఆస్పత్రుల ఎదుట క్యూ కట్టారంటూ వస్తోన్న వార్తలు మరోసారి ప్రపంచాన్ని వణికిస్తున్నాయి. 2001లోనే గుర్తించిన హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపీవీ) ప్రస్తుతం డ్రాగన్ దేశంలో వెలుగు చూస్తోన్న ఈ కేసులు నేడు మన దేశంలో నాలుగు కేసులు నమోదు కావడంతో నగరవాసులను ఆందోళన కలిగిస్తోంది. బెంగుళూరుకు చెందిన ఇద్దరు చిన్నారులకు, గుజరాత్‌లోని అహ్మదబాద్‌లో ఒకరికి, ఢిల్లీలో మరొకరికి ఈ వ్యాధిని గుర్తించిన తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే కేంద్రం మార్గదర్శకాలను సూచించింది. 15 సంవత్సరాలలోపు పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. శ్వాసకోస సంబంధ ఇన్‌ఫెక్షన్స్ ల నుంచి కాపాడుకునేందుకు ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను పాటించాలని తెలిపింది. కేంద్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పలు జాగ్రత్తలను సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తుగానే చర్యలు తీసుకోడానికి వైద్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి కనిపిస్తాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయవచ్చు. వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుంది. చిన్నారులు, వృద్దులు, బలహీనమైన రోగనిరోధక శక్తి కలిగిన వ్యక్తులు దీనిబారిన పడే అవకాశాలు ఎక్కువ. హెచ్ఎంపీవీ వైరస్‌కి నిర్దిష్టమైన యాంటీ వైరల్ చికిత్స, టీకాలు అందుబాటులో లేవన్న డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఇ).. తగిన విశ్రాంతి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం వంటి చర్యలు కొంత ఉపశమనం కలిగిస్తాయని తెలిపింది. తీవ్రమైన కేసుల్లో అయితే ఆస్పత్రిలో చేరి ఆక్సిజన్ థెరపీ, ఐవీఫ్లూయిడ్స్ అవసరమవుతాయని పేర్కొంది.

**ఆసుపత్రులలో తీసుకుంటున్న చర్యలు...**

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, ఉస్మానియా, పేట్ల బురుజు, రాంకోఠి, ఫీవర్ లాంటి ప్రధాన ఆస్పత్రులలో హెచ్ఎంపీవీ వైరస్ బాధితులకు తగిన చికిత్సలను అందజేయడానికి ప్రభుత్వం ఆదేశాల మేరకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆయా ఆస్పత్రుల వైద్యులు అత్యవసరమైన వైద్య పరికరాలు సిద్ధం చేశారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి, నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో కరోనా సమయంలో బాధితులకు అందజేసిన వైద్యం, ఇందుకు సంబంధించిన పరిరాలను భవిష్యత్తులో అవసరమవుతాయని అలాగే ఉంచారు. 2020 నుంచి ప్రతీ సంవత్సరం కరోనా నూతన మ్యుటేషన్‌లు వస్తుండడంతో వైద్యులు వాటిని అలాగే ఉంచేశారు. దాదాపు లక్ష మందికి కరోనా బాధితులకు చికిత్స అందించింది. 1698 కోవిడ్ డెలివరీలు చేశారు, అలాగే 1163 మందికి బ్లాక్ ఫంగస్ సర్జరీలు జరిపారు. అత్యత్భుతమైన వైద్య సేవలు అందిస్తు గాంధీ ఆస్పత్రి వైద్యులు వారి కృషిని చాటుకుంటున్నారు కేవలం తెలంగాణ ప్రజలకే కాకుండా పక్క రాష్ట్రల నుంచి వచ్చే రోగులకు కూడా అత్భుతమైన వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం హెచ్ఎంపీవీ బాధితులు వస్తే వారి కి కూడా సేవలు అందించేందుకు సిద్ధం చేసుకున్నారు.

**వ్యాప్తి ఇలా...**

-దగ్గు, తుమ్ము వల్ల వెలువడే తుంపర్లు.
-వైరస్ బారిని పడిన వ్యక్తులతో సన్నిహితంగా మెలగడం, కరచాలనం, తాకడం వంటి చర్యలు.
-వైరస్ వ్యాపించిన ప్రాంతాలను తాకిన తర్వాత నోరు, ముక్కు, కళ్లను తాకితే

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..**

- ప్రతి ఒక్కరూ విధిగా మాస్కు ధరించాలి.
'-సబ్బుతో 20 సెకండ్ల పాటు తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి.లేదా శానిటైజర్‌తో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి
-శుభ్రం చేసుకోని చేతులతో ముఖాన్ని తాకకుండా చూసుకోవాలి.
-వైరస్ బారినపడిన వ్యక్తులకు దూరం పాటించాలి.
-తరచూ తాకాల్సి వచ్చే పరిసరాలను శుభ్రం చేసుకోవాలి.
-బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయొద్దు.
-జలువు, దగ్గు విపరీతంగా ఉంటే.. తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి.



ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే స్టేషన్



నగరంలోని జూపార్క్-ఆరాంఘర్ రెండో అతిపెద్ద ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, మేయర్ విజయలక్ష్మీ,తదితరులు

# రూ.కోట్ల వసూళ్లపై ఎసిబి దృష్టి పెట్టేనా?

**-అధికారుల ఇష్టారాజ్యం**
**-అవినీతికి కేరాఫ్ సర్కిల్ 23 ఎసిపి, టిపిఎస్ కార్యాలయాలు**
**-ముడుపులిస్తేనే భవన నిర్మాణ అనుమతులు**

**హైదరాబాదు, జనవరి 6 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి మూసాపేట్ సర్కిల్ 23 అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) కార్యాలయంతో పాటు టీపీఎస్ కార్యాలయాలు అవినీతిలో రికార్డు సృష్టిస్తున్నాయి. ఓ సర్కిలలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తూ ఇక్కడ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కార్యాలయంలో (జోడు పదవులు) కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ఇంచార్జ్ అధికారితో పాటు ఓ మహిళా అధికారి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. భవన నిర్మాణాల అనుమతులకు అమ్యామ్యాలతో పాటు అక్రమ భవన నిర్మాణాలు సక్రమంగా కొనసాగేందుకు కొందరు అధికారులు చేస్తున్న రూ.కోట్ల అక్రమ వసూళ్ళపై ఏసీబీ దృష్టి సారించడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఆన్‌లైన్ సేవలు ప్రారంభ మైనా దరఖాస్తుదారుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. బిల్డర్లు, నిర్మాణదారులు ముడుపులు ఇవ్వకుంటే ఏసీపీ, టీపీఎస్ కార్యాలయాల చు ట్టూ కాళ్ళరిగేలా ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితిని సృష్టిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అన్నీ సక్ర మంగా ఉంటే నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వాలి. కాని ఇదంతా కాగితాలు, ప్రకటనలకే పరిమితం. ముడుపులిస్తేనే అనుమతులు రాని పరిస్థి తి నెలకొంది..

కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీ నగర్, మూసాపేట్, అల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్మాణ అనుమతులు సకాలంలో రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ అనుమతులకు పెద్ద మొత్తంలో అమ్యామ్యాలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇళ్ల నిర్మాణాల అనుమతి కోసం టీఎస్‌బీపాస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే టీఎస్‌బీపాస్ విధానానికి కొందరు అధికారులు తూట్లు పొడుస్తూ మామూళ్ళ కోసం దరఖాస్తుదారులను ముప్పతిప్పలు పెడుతున్నారు. నిర్మాణ దారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తారు. నిర్దేశిత రుసుము చెల్లిస్తారు. సాధారణంగా ఇవన్నీ సక్రమంగానే ఉంటాయి. కాబట్టి నిర్ణీ త గడువులోపు భవన నిర్మాణ అనుమతి రావాలి. అక్రమార్కులు అడిగినన్నీ మామూళ్ళు ఇస్తేనే అనుమతి రావడంలేదు. అన్ని సక్రమంగా ఉన్నా అనుమతి ఎందుకు ఇవ్వడం లేదని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తే ఏదో ఒకటి సాకుగా చూపిస్తూ అధికారులు, బ్రోకర్లు దరఖాస్తుదారుల నుంచి లక్షల్లో అక్రమ వసూళ్ళు చేస్తున్నట్లు తెలిసింది. నిర్మాణ అనుమతులకు సంబంధించి టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు జేబులు నింపుకోవడంపైనే ద్యాస ఉండడంతో దరఖాస్తుదారుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.ఏసీపీ కార్యాలయంలో ఓ ఇంచార్జ్ అధికారి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరి స్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యాల యంలో ప్రతి పనికి ఓ రేటు కట్టి లంచాలు వసూ లు చేస్తు న్నారు. బ్రోకర్లను కలిస్తేనే తప్ప ఇళ్ళ అనుమతులు మంజూరు కావడంలేదు. ఒక్క మాట చెప్పాలంటే ఈ కార్యాలయంలో బ్రోకర్ల హవా నడుస్తుందని చెప్పవచ్చు. అనేక మంది దళారులనే ఆశ్రయిస్తూ వారికి ఎంతో కొంత ము ట్టచెప్పి అనుమతులు తీసుకుంటున్నారు. భవన నిర్మాణ అనుమతుల్లో విపరీతమైన జాప్యం జరు గుతుండడంతో సంబంధిత అధికారులకు తెలపడానికి వెళితే వారు అందుబాటులో ఉండడంలేదు. అందుబాటులో లేని అధికారులు, సిబ్బంది కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చేసేది ఏమిలేక బ్రోకర్లను కలవడం లేకుంటే అధికారులు చెప్పినంత ముట్టచెప్పి తమ పనులను చేయించుకుంటున్నారు. చాలా మంది ఏసీబీని ఆశ్రయించడానికి ముందుకు రాకపోవడం తో ఓ మహిళా అధికారితోపాటు ఏసీపీ కార్యాల యంలో ఓ ఇంచార్జ్ అధికారి అక్రమాలు యధా విధిగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**అక్రమ నిర్మాణాలు పట్టించుకోని ఏసీపీ, టీపీఎస్‌లు**

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్వయంగా జిహెచ్ఎంసి కమిషనర్‌తో పాటు కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ ఆదేశిస్తున్నా ఇంచార్జ్ అధికారితో పాటు టీపీఎస్ పట్టించుకోకపోవడంలో మర్మమేమిటోనని పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలు సక్రమంగా కొనసాగేందుకు వసూలు చేస్తున్న రూ.కోట్ల రూపాయల్ని కింది నుంచి పై వరకు వాటాలుగా పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సర్కిల్ నుంచి అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్దంగా ఐదారు అంతస్తుల్ని నిర్మిస్తున్నా ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఇంచార్జ్ ఏసీపీతో పాటు టీపీఎస్ అడ్డుకోవడంలేదు. టౌన్ ప్లానింగ్‌లో కొందరు అధికారులు పట్టించుకోకుండా జేబులు నింపుకోవడానికే పరిమితం అయ్యారు. టీఎస్ బీపాస్‌తో అనుమతి తీసుకుని అందుకు విరుద్దంగా నిర్మాణాలు చేపడితే సదరు భవనాల్ని కూల్చివేయవచ్చు. కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీ నగర్, మూసాపేట్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్దంగా వెలుస్తున్న కమర్షియల్ భవనాలతో పాటు ఐదారు అంతస్తుల వరకు వెలుస్తున్న అక్రమ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు సర్కిల్ 23 ఏసీపీతో పాటు టీపీఎస్‌లు కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు సదరు అధికారులపై ఆరోపణలు వస్తున్నాయి. పెద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా జిహెచ్ఎంసి ఆదాయం కూడా పెరుగాల్సి ఉంటుంది. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటుపడి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి గండికొడుతున్నారు.

**రూ.కోట్ల అక్రమ వసూళ్ళపై ఎసిబి దృష్టి సారించేనా..**

మూసాపేట సర్కిల్ 23 అసిస్టెంట్ సిటీ ప్లానర్ కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహి స్తోన్న ఓ ఇంచార్జ్ అధికారితోపాటు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిర్మాణ అనుమతులకు మామూళ్ల తోపాటు అక్ర మ నిర్మాణాలు సక్రమంగా కొనసా గేందుకు తమవంతు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు చేస్తు న్న అక్రమాలు, అక్రమ వసూళ్ళపై అవినీతి నిరో ధక శాఖ దృష్టి సారిస్తే అనేక అక్రమాలు బయట పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటు న్నారు. ఉదయం వేళల్లో నిర్మాణాల వద్దకు వెళ్ళి తనిఖీ చేస్తూ సాయంత్రం, రాత్రి వేళల్లో అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నట్లు తెలిసింది. కొందరికి నగరం, శివార్ల తోపాటు వారి స్వంత జిల్లాల్లో రూ.కోట్లలో అక్రమ ఆస్తులు ఉన్నట్లు సమా చారం. గత కొంత కాలంగా బిల్డర్లు, నిర్మాణదారు ల వద్ద ఏ మేర రూ.కోట్లలో వసూలు చేశారో విచారణ చేస్తే వసూళ్ళ ఘనాపాటీల అక్రమాలు, రూ.కోట్ల అక్రమ వసూళ్ళు బయట పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

# రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం చిత్రపురి

**-అక్రమాల చిత్రపురి కమిటీని తక్షణమే రద్దు చేసి, ఆడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేయాలి**
**-రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల డిమాండ్**



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

**ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణలో అతిపెద్ద కుంభకోణం చిత్రపురి కాలనీ, డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి సినీ వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరిగిందని అఖిల పక్షనేతలు ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమ్ ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.బాలరాజ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి.నరసింహారావు, టి.పి.సి.సి. ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, టి.జె.ఎస్. గ్రేటర్ అధ్యక్షులు ఎం.నర్సయ్య, సీనియర్ రాజకీయ నాయకులు దేశ్‌పాండే పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత జరిగిన అతి పెద్ద కుంభకోణం చిత్రపురి కాలనీదేనని అన్నారు. చిత్రపురి కాలనీ బాధితులకు అండగా ఉండటమే కాకుండా అవినీతి, అధికారులను జైలుకు పంపించే వరకు ఊరుకోబోమని స్పష్టం చేశారు. చరణ్ కౌశిక్‌యాదవ్ మాట్లాడుతూ చిత్రపురి కాలనీ కుంభకోణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, కుంభకోణానికి పాల్పడిన సొసైటీ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే విధంగా వత్తిడి చేస్తానని హామీ ఇచ్చారు. డి.జే.నరసింహారావు మాట్లాడుతూ చిత్రపురి బాధితులకు ఎర్రజెండా అండగా ఉంటుందని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే వరకు వదిలే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎస్.బాలరాజ్ మాట్లాడుతూ ఇన్ని అక్రమాలు జరుగుతూ ఉంటే ప్రభుత్వ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సీపీఐ ఇప్పటికే చిత్రపురి అవినీతిపై అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. టీజేఎస్ నాయకులు నర్సయ్య మాట్లాడుతూ చిత్రపురి సమస్యపై కోదండరాం కూడా చర్చించారని, దీనిపై త్వరలోనే అందరం ముఖ్యమంత్రిని కలిసి చర్యలు తీసుకోవాలని కోరుదామన్నారు. దేశ్‌పాండే మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు కోర్ట్ ఆదేశాలను ధిక్కరిస్తూ ఉంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. అనంతరం సమావేశంలో కొన్ని తీర్మానాలు చేశారు. చిత్రపురి అక్రమాలపై అన్ని పార్టీలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటుచేయాలని, ప్రస్తుతం ఉన్న అక్రమాల కమిటీని రద్దు చేసి, అడ్‌హాక్ కమిటీని తక్షణమే ఏర్పాటుచేయాలని, సీఎం ను కలసి సమస్య తీవ్రతను తెలియచేయాలని, ఈ సమస్యపై అందరినీ కలుపుకుని వెళ్లాలని తీర్మానించారు. ఈ సమావేశంలో టీఎన్‌జీవో మాజీ నేత శ్యాంరావ్, చిత్రపురి ఉద్యమకారులు కస్తూరి శ్రీనివాస్, సామాజిక ఉద్యమకారులు భద్ర, సీఐటియూ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ నాయకులు సంకూరి రవీందర్, రమావేణి, రాజు, సినీ దర్శకులు కాత్రగడ్డ రవితేజ, మద్దినేని రమేష్, బాధితులు నిర్మల, పద్మావతి, ఆప్ నాయకులు విజయ్ పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో బిసిబిల్లుకై కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

**- బిసిలంతా ఐక్యంగా ఉద్యమించాలి**
**-కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలి**
**- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో ప్రసంగిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

**ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** పార్లమెంటులో బీసీ బిల్లుకై చంద్రబాబునాయుడు కేంద్రంపై వత్తిడి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సూచించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తల ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బోను దుర్గా నరేష్‌ను ఎంపిక చేసి, నియామకపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ నరేష్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఒక బలమైన శక్తిగా ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు ఎన్ని ఉన్నప్పటికీ అందరి లక్ష్యం బీసీల అభివృద్ధేనని, అందుకే అన్ని సంఘాల మధ్య మిత్ర బేధం మాత్రమే ఉండాలి తప్ప శత్రు బేధం ఉండకూడదని అన్నారు. ప్రధానిగా బీసీ ఉన్నారు కాబట్టి, బీసీలంతా ఒక్కటై గొంతెత్తితే తప్పకుండా మన సమస్యలన్నీ పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. గతంలో చేపట్టిన ఎన్నో పోరాటాల ఫలితంగానే ఈనాడు బీసీ బిడ్డలు చదువుకోగలుగుతున్నారని, అదే స్ఫూర్తితో జనాభా దామాషా ప్రకారం మన వాటా మనం సాధించుకోవాలని అన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేయాలని, బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించటానికి బీసీ యాక్ట్ తేవాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, దీనికై రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. నూతన అధ్యక్షులు బోను దుర్గా నరేష్ మాట్లాడుతూ కృష్ణన్న ఏ పిలుపు ఇచ్చినా బీసీలంతా పోరాడేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. తనపై పెట్టిన అధ్యక్ష బాధ్యతను అదృష్టంగా భావిస్తున్నానని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలందరినీ కలుపుకుని, ఎక్కడ ఎవరికి ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు గుజ్జకృష్ణ, ఆంధ్రప్రదేశ్ బీసీ మహిళా అధ్యక్షురాలు భీమవరపు హేమ, ప్రధాన కార్యదర్శి అజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా శ్రీనివాస్, వివిధ జిల్లాల నాయకులు విక్రమ్, కిరణ్, దినేష్, గణేష్, వనమాల శ్రీనివాస్, అనిల్, పద్మజ, జ్యోతి, గజేంద్రన్న, వీరన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**-డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి**




ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన వినతులకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కారించాలని జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వివిధ ప్రాంతాల నుండి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజలనుండి జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం పై అధికారులు చొరవ చూపాలన్నారు.ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 4 విన్నపాలు రాగా,సత్వర పరిష్కారం కోసం ఆయా విభాగాలకు పంపించడం జరిగింది. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 44 అర్జీలు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 10, ఇంజనీరింగ్ ( మెయింటెనెన్స్) విభాగానికి 7, ఎఫ్ ఏ సెక్షన్ కు 5, శానిటేషన్ విభాగానికి 3, ట్యాక్స్, హెల్త్, అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, ఎలక్ట్రికల్, యు బి డి విభాగాలకు 2 ఫిర్యాదుల చొప్పున, ఎంటమాలజీ, లేక్స్, అడ్వర్టైజ్మెంట్స్, ఐటీ, స్పోర్ట్స్, విజిలెన్స్, ఎస్టేట్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సి.సి.పి గంగాధర్, యు బి డి డైరెక్టర్ శ్రీనివాస రావు, ఎల్ఈవో రాములు నాయక్, (ఎస్ ఎన్ డి పి) డిప్యూటీ సి ఇ వెంకటేశ్వరరావు,వివిధ విభాగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## నిర్వాసితులకు మెట్రో స్టేషన్‌లలో వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలి : ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**-40మంది నిర్వాసితులకు 18.63కోట్ల చెక్కులు అందజేత**
**-నాలుగేళ్లలో పాతబస్తీ మెట్రో పూర్తి చేస్తాం : ఎన్.వి.ఎస్ రెడ్డి**



భూనిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న ఎంపి అసదుద్దీన్‌ఓవైసీ, మెట్రోఎండీ ఎన్‌విఎస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి తదితరులు

**హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త:** హైదరాబాద్ ఓల్డ్ సిటీలో చేపట్టే మెట్రో రైల్వే లైన్ నిర్మాణం కోసం పాత బస్తీ వాసులు ఇండ్లు, భూములు కోల్పోయిన వారు వ్యాపారం చేసుకునేందుకు మెట్రో స్టేషన్లలో మొదటి ప్రాధాన్యత కల్పించాలని హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు.సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మెట్రో రైల్ నిర్మాణం కోసం ఇండ్లు, స్థలాలు కోల్పోయిన వారికి 40 మంది భూ నిర్వాసిత లబ్దిదారులకు రూ 18.63 కోట్ల రూపాయల చెక్కులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మెట్రోఎండి ఎన్‌విఎస్ రెడ్డిలతో కలసి అందచేశారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ మెట్రో ప్రాజెక్ట్ పేజ్ 2 కింద 6వ కారిడార్ ను 7.5 కిలోమీటర్ల మెట్రో నిర్మాణ పనులు ఎంజిబిఎస్ నుండి చాంద్రయాణ గుట్ట వరకు నాలుగు సంవరత్సరాలలో రూ. 2,741 కోట్లతో ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలిపారు. మొత్తం 7.5 కిలోమీటర్ల మేరకు మెట్రో లైన్ అలాగే స్టేషన్లను సాలర్ జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఆలియాబాద్,ఫలక్ నుమాలలో చేపట్టడం జరుగుతుందని అన్నారు. లబ్దిదారులకు గజానికి 60 వేలు చెల్లించవలసి ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు సూచనల మేరకు గజానికి 81 వేలు పెంచి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. మెట్రోఎండి ఎన్‌విఎస్ రెడ్డి మాట్లాడుతూ ఓల్డ్ సిటీలో రూ.2741 కోట్లతో అత్యంత ఉన్నత ప్రమాణాలతో చేపట్టే మెట్రో లైన్ కారిడార్ 6ను నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. పాత బస్తీ మెట్రో నిర్వాసితులను ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిమాట్లాడుతూ హైదరాబాద్ మహానగరం విశ్వ నగరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తరుణంలో ఓల్డ్ సిటీ మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెట్రో లైన్ కింద ఇండ్లు, స్థలం కోల్పోయిన వారికి నష్టపరిహారం వేగవంతంగా అందచేయడం జరుగుతుందని వివరించారు. ఈకార్యక్రమం లో మెట్రో భూ సేకరణ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్వర్ణలత, ఆర్డిఓ రామకృష్ణ, జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : దయానంద్



నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ కమిటీ

**ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** ఆర్థికంగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న రవాణా రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గ్రేటర్ అధ్యక్షులు శాబంకర్ దయానంద్ డిమాండ్ చేశారు. సోమవారం నారాయణగూడలోని ఐఎన్‌టియూసీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోడ మల్లేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నికయింది. గ్రేటర్ అధ్యక్షునిగా శాబంకర్ దయానంద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఖలీద్, ఉపాధ్యక్షునిగా నాగమల్లు, డిప్యూటి జనరల్ సెక్రటరీగా నాగరాజు, జాయింట్ సెక్రటరీగా షేక్ జహంగీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపాల రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నేతలకు నియామక పత్రాలు అందచేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటో మీటర్ చార్జీలు పెంచకుండా ఆటో డ్రైవర్లను మోసం చేసిందని విమర్శించారు. కొంత మంది ప్రతిపక్ష యూనియన్ నాయకులు వారి పబ్బం గడుపుకునేందుకు ఆటో డ్రైవర్లను తప్పుదారి పట్టిస్తున్నారని, అలాంట వారి మాటలు ఎవరూ నమ్మవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలుచేస్తుందని తెలిపారు.

## న్యాయ విద్య ఎంతో పవిత్రమైంది : డాక్టర్ వినోద్



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాకళాశాలల స్వాగత సభ నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 6 ప్రభాతవార్త:** న్యాయ విద్య ఎంతో పవిత్రమైందని బెల్లంపల్లి శాసనసభ్యుడు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ జి.వినోద్, కరస్పాండెంట్ జి.సరోజా వివేక్ అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాకళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగత సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల కాక వెంకట్ స్వామి ఆశయాల కోసం పనిచేస్తుంది. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా అందించడమే లక్ష్యంగా పనిచేస్తుం దని పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థులు అన్ని రంగాలలో ముందుకు వెళ్లేందుకు కావలసిన సౌకర్యాలను కల్పిస్తామని పేర్కొ న్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణు ప్రియ గారు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు రెగ్యులర్గా అన్ని అకాడమీ కార్యక్రమాల్లో ముందుండాలన్నారు, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన మాట్లాడుతూ మన కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు న్నారని గత సంవత్సర కాలంలో విద్యార్థులు సాధించిన విజ యాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ వైస్ ప్రిన్సిపల్స్. అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 6 ప్రభాతవార్త:** వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం సుందరయ్యపార్కులో అట్టహాసంగా జరిగింది. క్లబ్ అధ్యక్షులుగా పి.వి. నిరంజన్రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ మనోహర్ రెడ్డి, కోశాధికారిగా ఎం. దశరత్, ఉపాధ్యక్షుడిగా వి. కళ్యాణ్ నాయక్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఎంజిఎఫ్ సిల్వర్ డోనర్ కె.లింగప్రకాష్ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిరంజన్ రెడ్డి, మనోహర్ రెడ్డిలు మాట్లాడుతూ... పార్కు అభివృద్ధితో పాటు వాకర్స్ ఆరోగ్య పరిరక్షణకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు వెంకటకృష్ణారావులు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు కె. రామానందం, వి. నాగభూషణం, టి. చక్రపాణి, మురళీకృష్ణ, కందూరి కృష్ణ, కె. సంపత్రెడ్డి, పి. రాజేంద్రప్రసాద్ గౌడ్, మాజీ అధ్యక్షులు ఆర్ వివేక్, ఎస్ రమేష్రెడ్డి, పి. వెంకట్స్వామి గౌడ్, వై. శ్రీనివాసచారి, గంగాధర్రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌లు

**హైదరాబాద్, జనవరి 6 ప్రభాతవార్త:** అంబర్‌పేట మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.కోటి ఖర్చుతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయ కుమార్ గౌడ్, ఆసుపత్రి వైద్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పేదలు డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాల్లో వెళ్లడం, ఆర్థిక భారం తట్టుకోలేక తనువు చాలించిన వారి అంశం తన దృష్టికి వచ్చిందన్నారు. దీంతో గత ఏడాది కాలం నుంచి వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నియోజకవర్గంలో ఉచిత డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చొరువ తీసుకున్నారు. ఎంతో విలువైన డయాలసిస్ సేవాలను పేదలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతున్న నేడు పేదవర్గాలకు డయాలసిస్ చేయించుకోవడానికి ఆర్థికంగా తీవ్ర భారంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ దక్షాయాణి, వైద్యులు ప్రతిభ, నాగశ్రీ, చంద్రశేఖర్, నిర్వహకులు అబ్దుల్ ఖాదీర్, బీఆర్ఎస్ నాయకులు రంగు సతీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు



కుస్తీపోటిలలోగెలుపు పొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందచేస్తున్న తెలంగాణ బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త

## కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీని అమలు చేయాలి : లక్ష్మీనారాయణ



ఖానాపూర్‌లో జరిగిన బిజెపి సమావేశంలో కామారెడ్డి బిసి డిక్లరేషన్ పత్రంను చూపుతున్న జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షులు లక్ష్మీనారాయణ

**నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ బిజెపి అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్ అధ్యక్షతన ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆది నుంచి ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ విధానమని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని ఏడాది కాంగ్రెస్ పాలనలో నెరవేర్చలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల లో ఒక్క ఉచిత బస్సు తప్పా మిగితా వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. గత పాలకులు అప్పులు చేశారని, అవినీతి చేశారని ఆరోపణలు చేయడం తప్పా కొత్తగా ఈ సర్కారు చేసిందేమి లేదన్నారు. మాటల గారడితో ప్రజల దృష్టిని మరల్చడం మాత్రమే చేస్తున్నారని, హామీల అమలు కోసం పని చేయడం లేదని పేర్కొన్నారు. కుల గణన, బిసి కమీషనర్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6.నెలల్లోనే బిసిల రిజర్వేషన్లు పెంచుతామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42.శాతం రిజర్వేశన్లు ఇచ్చి తీరుతామని, ప్రభుత్వ సివిల్ కన్స్ట్రక్షన్, మేయింటెనెన్స్ కాంట్రాక్టులలో 42.శాతం ఇప్పిస్తామని చెప్పి బిసిల ఓట్లు దండుకున్న నేతలు ఎందుకు ఆ దిశగా అడుగులు వేయడం లేదని ప్రశ్నించారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే సబ్‌ప్లాన్ చట్టబద్ద హోదా ఏమైందని, బిసి సంక్షేమానికి ఏడాదికి రూ.20.వేల కోట్లు ఎప్పుడిస్తారని నిలదీశారు. కేవలం ఓట్లు దండుకునేందుకు ప్రజలను ఆశల పల్లకిలో దింపి అధికారంలోకి వచ్చారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని, ప్రజలంతా కత్తులకన్నా పదునైనా ఓట్లతో పోటు పొడిచేందుకు సిద్దంగా ఉన్నారని లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాగేష్, శివరాజ్ పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే పశుసంవర్ధకశాఖ ఉద్యోగుల బదిలీలు



కార్యాలయంలో ప్రసంగిస్తున్న ఇరుసంఘాల నాయకులు

**నాంపల్లి, జనవరి 6 ప్రభాతవార్త :** రాష్ట్ర పశుసంవర్ధకశాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, ఎంతో పారదర్శకంగా జరిగాయని, అక్రమాలు, అవినీతికి తావులేకుండా ప్రశాంతంగా, సజావుగా జరిగాయని తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీసెస్ సంఘం, తెలంగాణ టీఎన్జీఓ వెటరినేరియన్ సంఘాలు స్పష్టం చేశాయి. బదిలీల్లో భాగంగా పశువైద్యులు, ఉద్యోగులు, అధికారులు సుమారు 800మందిని ప్రభుత్వం నిబంధనల మేరకే బదిలీ చేశారన్నారు. కొందరు సోషల్‌మీడియా వేదికగా ఆరోపణలు గుప్పించడంలో ఏమాత్రం వాస్తవం ఖండించారు. ఈమేరకు రాష్ట్ర పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల సంఘం అధ్యక్షుడు డా. మన్యం రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గంధం నాగయ్య, సహాధ్యక్షుడు మారం శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి డా. ఎం.శ్రీధర్‌రావు మాట్లాడుతూ బదిలీల ముందే శాఖ డైరెక్టర్ ఉద్యోగ సంఘాలను సంప్రదించి అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు జరిపారని వివరించారు. శాఖ డైరెక్టర్ గోపి అరాచకాలంటూ సోషల్ మీడియాలోని కథనాలకు వారు తీవ్రంగా ఖండించారు. అలాగే శాఖ ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి అవకతవకలు జరుగకపోయినా కొన్ని శక్తులు అవాస్తవాలను ఉద్దేశపూర్వకంగా డైరెక్టర్ గోపిపై ఆరోపణలు సబబుకాదని, అది వారి విజ్ఞతకే విడిచివేస్తున్నామని తెలంగాణ టీఎన్జీఓ వెటరినేరియన్ సంఘం అధ్యక్షుడు బి.సురేష్, కార్యదర్శి అభిషేక్‌రెడ్డి, సహాధ్యక్షుడు కె.రతన్‌లు అన్నారు. ఈ దురుద్దేశ ఆరోపణల నిగ్గుతేల్చేందుకు సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని వారు కోరారు.

## సమాజానికి జర్నలిస్టుల సేవలు ఎనలేనివి : ఎంపి ఈటల రాజేందర్



కె.వి.రమణారావుకు రాష్ట్రాధ్యక్షుడుగా ఏకగ్రీవ ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న ఎంపి ఈటల రాజేందర్ తదితరులు

**నాంపల్లి, జనవరి 6 ప్రభాతవార్త :** ఒక నిర్దిష్ట సమయం, సరైన జీతంలేని ఉద్యోగంతో ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులు సామాజానికి చేస్తున్న నిరంతర ఎనలేని సేవలు మరువలేనివని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈమేరకు ఉప్పల లక్ష్మణ్ సారధ్యంలో ఎన్నికల అధికారి మహమ్మద్ ఖాసిం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్‌కు అధ్యక్షుడుగా రెండవసారీ ఏకగ్రీవంగా ఎన్నికైన కె.డి.రమణారావును అభినందించారు. ముందుగా హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అంతర్జాలం జూమ్ వేదికగా అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రాధ్యక్షుడు కె.వి.రమణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్కల్కర్ రాజేంద్రనాథ్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు శుభాభినందనలు తెలిపారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఉప్పల్ లక్ష్మణ్, దిలీప్‌కుమార్, డా. ఎఎస్‌రావు తదితర ప్రముఖులు సమావేశానికి విచ్చేసి నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపికైన వారికి సూచించారు. ఈ సమావేశంలో మోహన్‌యాదవ్, మహ్మద్ గోరి, ఖలీల్, హరీష్, జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఏపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.సూర్యనారాయణరెడ్డి, ఎన్‌యుసే కన్వీనర్ మీనాక్షి సుందరం తదితరులు పాల్గొని టీజెఏ నూతన కమిటీకి అభినందనలు తెలిపారు.

### బాలాపూర్‌లో ఒకే రోజు ముగ్గురి మృతి..

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో ఒకే రోజు ముగ్గురు మృతి చెందడం గ్రామంలో విషాద ఛాయలు నింపింది. కొన్ని గంటల తేడాలోనే గ్రామానికి చెందిన ముగ్గురు మరణించడం చర్చనీయాంశమైంది. బడంగ్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ ఛైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి తల్లి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత అత్త అయిన చిగిరింత సరోజనమ్మ, అదే గ్రామానికి చెందిన వనం మహేందర్‌రెడ్డి, రామిడి వెంకట్‌రెడ్డిలు కొన్ని గంటల తేడాతో మృత్యువు ఒడికి చేరడం గ్రామస్తుల్లో విషాదాన్ని నింపింది. కాగా మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సోమవారం మధ్యాహ్నం గంటల తేడాలో స్థానిక బాలాపూర్ స్మశానవాటికలో వారి అంత్యక్రియలు జరిగాయి.

### నాదర్‌గుల్ మాజీ పోలీస్ పటేల్ సతీమణి మృతి

కాగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోనే ఉన్న నాదర్‌గుల్‌కు చెందిన మాజీ పోలీస్ పటేల్ కటికిరెడ్డి నారాయణరెడ్డి సతీమణి కటికిరెడ్డి సరోజనమ్మ సైతం సోమవారం మృతి చెందడం గమనార్హం. బిఎన్‌రెడ్డినగర్ సమీపంలోని ఎస్‌కెడి నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. దీంతో నాదర్‌గుల్ గ్రామంలో సైతం విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు నేతలు, గ్రామస్తులు సరోజనమ్మ కుటుంబ సభ్యులతో పాటు నారాయణరెడ్డి చిన్న సోదరుడు కటికిరెడ్డి శ్రీరాంరెడ్డిని పరామర్శించారు. సరోజనమ్మ అంత్యక్రియలు సాహెబ్‌నగర్ స్మశానవాటికలో సోమవారం మధ్యాహ్నం జరిగాయి. అయితే మొత్తం మీద బాలాపూర్ మండలానికి చెందిన పేరున్న కుటుంబాల్లో నలుగురు ఒకే రోజు మృతి చెందడం చర్చనీయాంశమైంది.

### హైదరాబాద్ కరాటే పోటీల్లో లార్డ్స్ విద్యార్థికి రజత పతకం

**సరూర్‌నగర్, జనవరి 6 ప్రభాతవార్త:** హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బడంగ్‌పేట్‌కు చెందిన లార్డ్స్ హై స్కూల్ 4వ తరగతి విద్యార్థి ఎ.రుద్రాంశ్‌దేవ్ ప్రతిభ కనబరచి రజత పతకాన్ని సాధించాడు. ఈ నేపథ్యంలో లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల చిన్న బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్ల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ రామిడి సంతోష్, ఇంఛార్జి రేఖాసాగర్‌లు కరాటే పోటీల్లో సత్తా చాటిన రుద్రాంశదేవ్‌ను అభినందిం చారు. ఈ సందర్భంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు మాట్లాడు తూ విద్యతో పాటు క్రీడలు, ఆత్మరక్షణకు సంబంధించిన మార్షల్ ఆర్ట్స్‌లలో లార్డ్స్ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా మని తెలిపారు.

## ఎస్సీవర్గీకరణకు తాము వ్యతిరేకం

**మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్‌బాబు**



ప్రభుత్వ కమిషన్ ఆఫ్ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలను కలిసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్‌బాబు కలిసిన దృశ్యం

**చిక్కడపల్లి జనవరి 6 ప్రభాతవార్త:** శాస్త్రీయతలేని ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోపోజు రమేశ్‌బాబు వివరించారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమిషన్ ఆఫ్ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను గోపుజు రమేశ్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ రిజర్వేషన్‌లలో క్రిమిలేయర్ వర్తింప చేయడం రాజ్యాంగ విరుద్ధమని, వర్గీకరణ చేయడం అంటే దళితులను శాశ్వతంగా రాజ్యాధికారానికి దూరం చేయడమేనని, ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ పోస్టులు మిగులకుండా వందశాతం రిజర్వేషన్‌లు అందుకునేలా ఎస్సీలను అభివృద్ధి చేయాలని, రాష్ట్రప్రభుత్వం కులగణన చేస్తే రాజ్యాంగ బద్దం కాదని, కేంద్ర ప్రభుత్వం చేయాలని, మాలమాదిగలు కాకుండా మిగతా 57కులాలను గుర్తించి వారందరిని నియోజకవర్గం కేంద్రంలో ఇళ్లస్థలాలు కేటాయించి, ఇళ్ళు నిర్మించి వారికి ఉపాధి కల్పించి ప్రత్యేక విద్య అందించి, మాలమాదిగ కులాలతో సమానంగా రిజర్వేషన్‌లు అందుకునే విధంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మాల సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ఛైర్మన్ గోపోజు రమేష్ బాబు మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు కొండ్ర రాజలింగం మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒలికి కృష్ణమూర్తి రాష్ట్ర కార్యదర్శి ఎన్నమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నగర కమిషనర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు




కమిషనర్ సీవీ ఆనంద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న కంటోన్మెంట్ శాసన సభ్యులు శ్రీగణేష్

**కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం సాయంత్రం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## ఫ్లై ఓవర్‌కు సర్ధార్ వల్లబాయ్ పటేల్ పేరు పెట్టాలి



**అత్తాపూర్ జనవరి6,ప్రభాతవార్త :** సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన బహదూర్‌పుర, జూపార్క్, ఆరాంఘర్ నూతన ఫ్లై ఓవర్‌కు సర్ధార్ వల్లబాయ్ పటేల్ ఫ్లై ఓవర్ పేరు పెట్టాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సెక్రటరీ నేరుట్ల జగన్‌లు డిమాండ్ చేశారు. సోమవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఆరాంఘర్ చౌరాస్తాలో బిజెపి నాయకులు ధర్నా దిగారు. నూతన ఫ్లై ఓవర్‌కు సర్ధార్ వల్లాబాయ్ పటేల్ పేరు పెట్టాలని నినాదాలు చేశారు. దింతో వారిని పోలీసులు అరెస్టు చేసి రాజేంద్ర నగర్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సర్ధార్ వల్లభాయ్ పటేల్ పేరు పెట్టే వరకు పోరాట సాగిస్తామని వెంటనే సిఎం రేవంత్ రెడ్డి స్పందించి పేరు పెట్టాలని అన్నారు. అరెస్టు అయినవారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ ,సెక్రటరీ నేరుట్ల జగన్, పెంజర వెంకటరెడ్డి, విజయ స్వామి శశికాంత్ శర్మ మోహన్ లు ఉన్నారు.

## రామ్‌నగర్ డివిజన్ బిజెపి అధ్యక్ష పదవి రేసులో ఐదుగురు

**-చిక్కడపల్లి కమ్యునిటీ హాల్‌లో పార్టీ పరిశీలకులతో నేతల భేటి**



రామ్‌నగర్ డివిజన్ నేతలతో సమావేశమైన పార్టీ పరిశీలకులు

**చిక్కడపల్లి, జనవరి 6 ప్రభాతవార్త:** రామ్‌నగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి అభిప్రాయ సేకరణ కార్యక్రమం చిక్కడపల్లి కమ్యునిటీ హాల్‌లో నిర్వహించారు. బిజెపి రాష్ట్ర పార్టీ నియమించిన పరిశీలకులు బిజెపి సీనియర్ నాయకులు ఎదుళ్ళ వెంకటరెడ్డితో పాటు శంకర్ సమక్షంలో డివిజన్‌కు చెందిన ఐదుగురు తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని దరఖాస్తులు సమర్పించారు. ఓబిసి సెల్ నగర కార్యవర్గసభ్యుడు ఎన్.శ్రీనివాస్, డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి కె.ఉపేందర్, పార్టీ నాయకుడు జక్క శ్రీనివాస్‌తో పాటు బాలు, యువమోర్చ నాయకుడు శక్తిసింగ్, గడ్డం సతీష్ తదితరులు డివిజన్ అధ్యక్ష పదవికి తమ పేరును పరిశీలించాలని వేడుకున్నారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి పూస రాజు, స్థానిక కార్పొరేటర్ రవిచారితో పాటు బిజెపి సీనియర్ నేతలు రమేశ్‌రామ్, బిజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, కె.అరుణ్‌కుమార్, సి.పార్థసారథి తదితరులున్నారు. డివిజన్ అధ్యక్షుడి నియామకం రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల దృష్టిలో ఉంచుకుని డివిజన్‌పై మంచి పట్టు ఉన్న నేతతో పాటు ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండడం, పార్టీ నిర్వహించే కార్యక్రమాలను సమర్దవంతంగా నిర్వహించడంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల వద్దకు తీసుకువెళ్ళే సమర్దుడైన నాయకుడిని పార్టీ నియమించాల్సి ఉంటుంది. అంతేకాకుండా కేంద్రంలలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వద్దకు తీసుకెళ్లి పార్టీ పట్ల ప్రజలు ఆకర్షితులయ్యేలా చూడడం ఇలా అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉన్న నేతలను ఎంపిక చేయాల్సి ఉంటుంది. డివిజన్ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారిలో నలుగులు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కాగా ఒకరు రాజ్‌పుత్, మరొకరు ఎస్సీ వర్గానికి చెందిన వారు ఉన్నారు. ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆశీస్సులున్న వారికే డివిజన్ అధ్యక్ష పదవి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రస్తుతం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కె.ఉపేందర్ లేదా ఓబీసీ సెల్ నగర కార్యవర్గసభ్యుడు ఎన్.శ్రీనివాస్, జక శ్రీనివాస్ వీరిలో ఒకరికి డివిజన్ అధ్యక్ష పదవి దక్కే అవకాశాలున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

## నర్సమ్మకు నివాళులర్పించిన కాలేరు పద్మవెంకటేష్



గోల్నాకలో నర్సమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి కాలేరు పద్మ

**హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త**

గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో స్వర్గస్తులైన నర్సమ్మ(88)కు సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ వెంకటేష్ నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి నర్సమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాస్, పి.సంతోష్‌కుమార్‌లను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్ పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగం



బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త :** నిరుపేదలకు సిఎం సహాయ నిధి ఎంతగానో ఉపకరిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ 18.వ,వార్డుకు చెందిన అనంతరాములుకు రూ.60.వేల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు పెద్ద జబ్బులు వస్తే డబ్బులు లేక ప్రాణాలపై ఆశలు వదిలేసుకునే వారని, సీఎం సహాయ నిధి రావడంతో పెద్ద ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొంది బాగవుతున్నారన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పతకాలు అందించేందుకు నావంతు పూర్తి సహకారంను అందజేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. 18.వ, వార్డులో కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలపై వేగంగా స్పందిస్తూ మంచి ప్రజా ప్రతినిధిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. నాయకుడు అంటే ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, అప్పుడే ప్రజలు నమ్ముతారని, ఎన్నికల్లో ఓట్లను వేసి అండగా నిలబడుతారని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు.

## నార్సింగి మార్కెట్‌కు రెండు ఎకరాల స్థలాన్ని ఇవ్వాలి

**- నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణుగౌడ్**



నార్సింగి మార్కెట్ కమిటీ తొలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ కోట వేణుగౌడ్, వైస్ చైర్మన్ దశరథ్ యాదవ్, డైరెక్టర్ల దృశ్యం

**నార్సింగి, జనవరి 6 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపల్ ఆధీనంలో ఉన్న రెండు ఎకరాల భూమిని తిరిగి నార్సింగి మార్కెట్ కమిటీకి ఇవ్వాలని చైర్మన్ కోట వేణుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నార్సింగి మార్కెట్ కమిటీ తొలి సమావేశం కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులంతా కలిసి నార్సింగి మార్కెట్ అభివృద్ధిపై సమాలోచనలు పలు ఏకగ్రీవ తీర్మాణాలు చేశారు. అనంతరం చైర్మన్ వేణుగౌడ్ మాట్లాడుతూ రెండు ఎకరాల స్థలంను మార్కెట్‌కు అప్పగించాలని, క్యాటిల్ షెడ్లకు అద్దె వసూలు చేయాలని, కార్యాల భవనంకు, 2. మంచినీటి ట్యాంకుల నిర్మాణం, మలమూత్ర విసర్జన శాలల నిర్మాణం కోసం తొలి సమావేశంలో తీర్మాణం చేశామని వివరించారు. పాలకవర్గ సభ్యులమంతా కలిసి నార్సింగి మార్కెట్‌ను ఆధునీకరించి, ఆదాయంను గణనీయంగా పెంచేందుకు కసరత్తు ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, అవసరమైతే సీఎంను కలిసైనా వేగంగా శతాబ్దాల చరిత్ర కలిగి ఉన్న నార్సింగి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్‌ను ఆధునీకరించి ఆదాయంను సముపార్జించేందుకు ప్రణాలికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ, డైరెక్టర్లు శేఖర్ బాబు, దారుగుపల్లి బాల్‌రామ్, తలారి ప్రేమ్ కుమార్, ధర్మపురి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




నూరారం కాలనీ రాజీవ్ గృహకల్పలో రోడ్లకు ఇరువైపులా అక్రమాలు జరుగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా వెలసిన డబ్బాలను తొలగించాలని అసోసియేషన్ అధ్యక్షులు శివ గౌడ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

## శ్రీశైలంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



శ్రీశైలంలో దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 6 ప్రభాతవార్త:** సోమవారం తెల్లవారు జామున శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ఆయనకు వేద ఆశీర్వాదంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలపై ఉండాలని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే రేవంత్ రెడ్డి గారి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తుందని , ప్రభుత్వం పైన, ముఖ్యమంత్రి గారి పైన కూడా స్వామి కృప ఉండాలని, రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్లేలా దీవించమని స్వామి వారిని కోరుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు.

## ట్రాఫిక్ హోంగార్డుపై దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు నమోదు

**పేట్ బషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త**

విధుల్లో ఉన్న అల్వాల్ ట్రాఫిక్ హోంగార్డు ఎ.బాల్‌దాస్ ఓ వ్యక్తి విధినిర్వహణకు అడ్డుతగిలి దుర్భాషలాడడంతో కేసు నమోదైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5న సాయంత్రం సమయంలో కొంపల్లిలో అపర్ణ గ్రీన్ స్కేప్ ఎదురుగా అల్వాల్ ట్రాఫిక్ స్టేషన్‌కు సంబంధించిన హోంగార్డు ఎ.బాల్‌దాస్ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఎదురుగా రాంగ్ రూట్లో హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనంపై వస్తున్న కొంపల్లి ఎన్‌సిఎల్‌కు చెందిన ప్రవీణ్‌ను ఫోటో తీసాడు. దీంతో కోపోద్రిక్తుడైన సదరు వ్యక్తి తాను స్థానిక కౌన్సిలర్ భర్తను అని, తన వాహనాన్నే ఫోటో తీస్తావా అంటూ నోటిపదజాలంతో దూషించి విధులకు ఆటంకం కల్పించాడు. అదే సమయంలో డీడీ చెక్ చేయగా అతిగా మద్యం సేవించి ఉన్నాడు. దీంతో సదరు హోంగార్డు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**బేగంబజార్, జనవరి 6ప్రభాతవార్త:** ఫైర్‌స్టేషన్ 11కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లుబేగంబజార్ సిబిడి ఎడిఇ వెంకటేశ్వర్లు తెలిపారు. గురుద్వారా లైన్, అమృత్‌బార్ లైన్ తదితర ప్రాంతాలల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. విక్టరీప్లేగ్రౌండ్ 11కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10గంటల నుంచి 30నిమిషాల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కుత్బీగౌడ 11కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు కుత్బీగూడ, సుప్రభాత్ హోటల్, గణేష్‌టెంపుల్ తదితర ప్రాంతాలు, మెటర్నటి ఆసుపత్రి11 కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

## ఇంటి నుండి యువతి అదృశ్యం



మధులిక (ఫైల్‌ఫోటో)

**ముషీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** ఇంటి నుండి ఒక యువతి చెప్పకుండా వెళ్లిపోయిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం బోయిగూడలో నివసించే గంగారావ్ శ్రీనివాస్, మహేశ్వరి దంపతులకు నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె మధులిక ఒక అపరిచిత యువకుడితో (అజయ్) ఫోన్‌లో తరచుగా మాట్లాడటం గమనించిన కుటుంబ సభ్యులు మందలించి, కాలేజి మాన్పించారు. సోమవారం మధ్యాహ్నం మధులిక ఇంటి నుండి చెప్పకుండా వెళ్లిపోవటం గమనించిన కుటుంబ సభ్యులు ఆమె కోసం తెలిసిన ప్రాంతాలలో వెతికి, బంధువులను, స్నేహితులను విచారించారు. మధులిక మధ్యాహ్నం ఎవరో ఒక యువకుని ద్విచక్రవాహనంపై వెళ్లటం గమనించామని బంధువులు చెప్పటంతో కూతురి ఆచూకీ తెలపాలని పోలీసులను ఆశ్రయించారు. మధులిక కనిపించకుండా పోవటానికి అజయ్ కారణం కావచ్చునని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. మధులిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించామని సీఐ తెలిపారు.

